క్లుప్తంగా

కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఓదెలు



కమలాపూర్: మండలంలోని భీంపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా కుక్కల ఓదెలును బుధవారం నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు గుండవు చరణ్‌పటేల్ తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, హుజూరాబాద్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ బల్మూరి వెంకట్ ఆదేశాల మేరకు మండల ఇన్‌చార్జ్ తోట వెంకన్న ఆధ్వర్యంలో గ్రామ కమిటీని నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేశిని అయిలయ్యగౌడ్, నాయకులు రిక్కల నారాయణరెడ్డి, భిక్షపతి, ఓదెలు, మనీష్, ఎండీ.తాజోద్దీన్, కుమార్, రాజన్, రవిచంద్ర, మధుకర్, రాకేష్, మహేష్, కుమార్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

ఎల్కతుర్తి : మండలంలోని దామెర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాతూరి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా మంతుర్తి రాజు, ప్రధాన కార్యదర్శిగా రాంసింగ్, కోశాధికారిగా కడారి భిక్షపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా బక్రిద్, కుక్కల రాజు, ఉపాధ్యక్షుడిగా బీ.రాజు, రమేష్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా జీ.బాబు, బీసీ సెల్ అధ్యక్షుడిగా మంతుర్తి రవి, ఓసీ సెల్ అధ్యక్షుడిగా చల్లా శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ కాశీ, గౌరవ సభ్యులుగా చల్లా రమణారెడ్డి, గొర్రె కొమురయ్య, రవీందర్‌రెడ్డి, నరేందర్, రాజేందర్, ప్రచార కార్యదర్శులుగా మల్లయ్య, సుధీర్ ఎన్నికయ్యారు.

విద్యార్థి సంఘ నాయకుల అరెస్టు అమానుషం

శాయంపేట : ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభను అడ్డుకుంటారనే భయంతో విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం అమానుషమని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ అన్నారు. విద్యార్థిసంఘ నాయకులు నరేష్‌ను పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

పాము కాటుతో ఎద్దు మృతి

కమలాపూర్ : మండలంలోని శంభునిపల్లికి చెందిన కట్కూరి ప్రభాకర్‌రెడ్డి రైతుకు చెందిన ఎద్దు మంగళవారం రాత్రి పాముకాటుతో మృతి చెందిందని రైతు తెలిపాడు. తన ఇంటి ఆవరణలో ఉన్న ఎద్దు మధ్యాహ్నం నుంచి మేత మేస్తూ బాగానే ఉందని, రాత్రి సమయంలో పాము కాటుకు గురై తెల్లారేసరికి మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎద్దు విలువ రూ.65 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరాడు.

20, 21న ఎంసీపీఐయూ జిల్లా ప్లీనరీ సమావేశాలు

పరకాల: భారతీయ మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) జిల్లా ప్లీనరీ సమావేశాలు ఈ నెల 20 నుంచి 21 వరకు పరకాల పట్టణంలో నిర్వహించనున్నట్లు ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్వర్ణగార్డెన్‌లో జరిగే ప్లీనరీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నాగుర్ల పరామర్శ



నడికూడ: మండలంలోని కౌకొండకు చెందిన మహ్మద్ భాష ఇటీవల మృతి చెందగా బుధవారం వారి కుటుంబ సభ్యులను తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. శోభన్, తిరుపతి, శ్రీనివాస్, శంకర్, రవి, రాజేష్, మనోహర్ రావు, కిషన్‌రావు ఉన్నారు. రేషన్‌ద్వారా సన్న బియ్యం అందచేయాలిఆత్మకూరు : రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందజేయాలని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో ఇతర డివిజన్లలో సన్నబియ్యం సరఫరా అవుతున్నప్పటికీ పరకాల డివిజన్ పరిధిలో రేషన్‌షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రింటర్ బహూకరణ

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు బుధవారం రూ.17వేల విలువ గల జిరాక్స్ కమ్ ప్రింటర్ మిషన్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు వెంకట్రావ్, సుమలత, కరంచంద్, ప్రభాకర్, శ్రీనివాస్, మాధవి, సంధ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జాతరలో పారిశుద్ధ్య సిబ్బంది సేవలు భేష్

- భక్తుల్లో ఆనందం నింపిన వైనం
- ముగిసిన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు



జాతర వీధులను శుభ్రపరుస్తున్న సిబ్బంది

భీమదేవరపల్లి: వారి ఇండ్లల్లో బంధువులు, కుటుంబ సభ్యుల కోలాహలం.. ఓ వైపు పండుగ వాతావరణం.. మరోవైపు ఇంటివద్ద కుటుంబ సభ్యులతో ఆనంద క్షణాలను గడుపకుండా పారిశుద్ధ్య సిబ్బంది భక్తుల కోసం పరితపించారు. జాతరలో వారే సర్వస్వమై భక్తులకి సేవలందించారు. మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థానంలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్య సిబ్బంది అందించిన సేవలపై ప్రత్యేక కథనం..

వందలు కాదు, వేలు కాదు లక్షల్లో భక్తజనం కొత్తకొండను తాకిన వేళలో అపరిశుభ్రత ఉంటుందనే అపోహలను పారిశుద్ధ్య సిబ్బంది తలక్రిందులు చేశారు. నిత్యం జాతరలో సేవలందించి భక్తుల్లో ఆనందం నింపారు. వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 10న స్వామి వారి కల్యాణంతో ప్రారంభమై 18న అగ్నిగుండాలతో ముగిశాయి. అయితే బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్య సేవలపై జిల్లా కలెక్టర్, డీపీఓ ఆదేశాల మేరకు ఎంపీడీఓ భాస్కర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. అధికారుల పర్యవేక్షణ, సిబ్బంది పనితీరు బ్రహ్మోత్సవాల్లో అపరిశుభ్రత లేకుండా దర్శనమిచ్చాయి. లక్షలాది మంది తరలివచ్చినప్పటికీ చిన్న కాగితపు ముక్క సైతం లేకుండా జాతర ఆవరణ దర్శనమిచ్చాయి.

200 మంది సిబ్బంది సేవలు

జాతరలో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేరు మండలాలకు చెందిన సిబ్బంది 200 మంది తమ సేవలను వినియోగించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజమల్లారెడ్డి, ఎంపీఓలు నాగరాజు, రవి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు జంగం పూర్ణచందర్‌తో పాటు సిబ్బంది విశేషంగా కృషి చేశారు. జాతరలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని బయటవేసేందుకు మూడు ట్రాక్టర్లు దుమ్ము, దూళి లేకుండా జాతర ప్రాంగణాన్ని మూడు ట్యాంకర్లతో నీటిని చల్లారు.

చెత్తా, చెదారం లేదు..



జాతరలో ఎలాంటి చెత్తా, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంది. జాతర వీధులు సైతం పరిశుభ్రంగా ఉంచడంలో సిబ్బంది కృషి చేశారు. ఎలాంటి దుమ్ము, దూళి లేకుండా జాతర పరిసర ప్రాంతాలు ఉన్నాయి.

– మొగిళి, భక్తుడు హుస్నాబాద్

అందరి సహకారంతోనే..



అందరి సహకారంతో జాతరలో ఎలాంటి అపరిశుభ్రత లేకుండా పనిచేశాం. జిల్లా అధికా రుల ఆదేశాలు సిబ్బంది సమష్టి కృషితోనే జాతరను దిగ్విజయంగా పూర్తి చేశాం.

– భాస్కర్ ఎంపీడీఓ

రైతులు అప్రమత్తంగా ఉండాలి



వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ దామోదర్‌రెడ్డి

ఎల్కతుర్తి : వరిలో కాండం తొలుచుపురుగు, ఉల్లికోడు తెగులు ఆశించినందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ సంచాలకులు దామోదర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని చింతలపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరిపంట పొలాలను బుధవారం సందర్శించి పంటను పరిశీలించారు. పంటతెగుళ్ల నివారణకు క్లోరంత్రినిలిప్రోల్ 60 ఎంఎల్, లేదా పెరాక్రి, క్లోరం త్రినిలిప్రోల్ ప్లస్ లాంబ్డా సిహాలోత్రిన్ కలిపి ఎకరానికి 80 ఎంఎల్, లేదా కారోటాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాముల ఎకరాకు, వేపనూనె మందు 500 ఎంఎల్‌తో కలిపి ఎకరాకు పిచికారి చేయాలన్నారు. అదేవిధంగా కార్బోఫిరాన్ గుళికలు ఎకరానికి 10 కిలోలు, లేదా కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరానికి 8 కిలోలు, లేదా క్లోరత్రి నీలిప్రోల్ గుళికలు 4 కిలోలు ఎకరానికి చల్లాలని సూచించారు. వారి వెంట ఏఈవోలు కల్యాణి, రాజ్‌కుమార్, తిరుపతి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు నిరుపేదలకు పంచాలి



వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ధర్మసాగర్ : మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను జీఓ నంబర్ 58, 59 ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలలోని నిరుపేదలను గుర్తించి వారికి పంపిణీ చేయాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంగారపు సుమన్ కుమార్, జాతీయ ఉపాధ్యక్షుడు సాతూరి వెంకన్న డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు పుట్ట నవీన్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు చెందాల్సిన ప్రభుత్వ భూములను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమించుకొని వారి సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సాతూరి కోమల, జిల్లా కార్యదర్శి పోగుల రాకేష్, కాజీపేట మండల అధ్యక్షుడు కొడవటి తిరుపతి, మండల అధికార ప్రతినిధి గంగారపు యశ్వంత్, ధర్మసాగర్ మండల అధికార ప్రతినిధి దార విజయకాంత్, పుట్ట సందీప్, తరుణ్, జగన్, కొట్టె పాల్ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- పరకాల ఎమ్మెల్యే చాల్లా ధర్మారెడ్డి



ప్రీతమ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

దామెర : క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని తక్కళ్లపహడ్‌కు చెందిన చెల్పూరి ప్రీతమ్ నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. కాగా ఇటీవల రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. ఈ నెల 25 నుంచి 28 వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ఎమ్మెల్యే తన నివాసంలో ప్రీతమ్‌ను బుధవారం శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడా, సాంస్కృతిక రంగాలకు పెద్దపీటవేసి ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాలన్ని క్రీడాకారులు, కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు దాడి రమేష్, జి.రంజిత్, కె. క్రిష్ణ, డి.చిరంజీవి, మండల నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ ఆశయాలను కొనసాగించాలి



కమలాపూర్: పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



ఎల్కతుర్తి : ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాని పలువురు వక్తలు కొనియాడారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం వద్ద ఎన్టీఆర్ 27వ వర్ధంతిని జరుపుకున్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీటీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్య దర్శి సోరుపాక రాజు, రాష్ట్ర పరిశీలకుడు స్వామి, అడ్వకేట్ బీసీ సెల్ అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు తోకల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్‌లో ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ నాయకులు బుధవారం నిర్వహించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో టీడీపీ వరంగల్ పార్లమెంటు ప్రధానకార్యదర్శి జనార్ధన్‌రావు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కందుకూరి నరేష్, నల్ల రవి, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు: ఎన్‌టీఆర్ 27వ వర్ధంతిని పురస్కరించుకుని మండల పార్టీ అధ్యక్షుడు సంద్ర మల్లాజి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి అర్షనపల్లి విద్యాసాగర్ హాజరై ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంతో పాటు పున్నేలు లోని కనకదుర్గ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గబ్బెట రాజు, కొంరయ్య, శ్రీనివాస్, రవీందర్, కుమార స్వామి గుప్తా, అరుణ, రమేష్, పాల్గొన్నారు.

కమలాపూర్ : మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారకరామారావు 27వ వర్ధంని తెలుగు దేశం పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో నిర్వహిచారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పెరుమాండ్ల పరుశరాములుగౌడ్,నాయకులు కస్తూరి ముత్యాలు, శనిగరపు రవీందర్, సల్వాల కుమార స్వామి, బండి రాజకిషోర్, మేడిపల్లి వీరయ్య, చేరాల సారంగం, మొగిలి, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్కతుర్తి: మండలంలోని వీరనారాయణపూర్ గ్రామానికి చెందిన మంద వరప్రసాద్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు, వృక్షప్రదాత జన్నారపు సురేందర్‌రెడ్డి బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుని పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వరప్రసాద్ కటుంబానికి బీజేపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, నాయకులు పల్లెపాటి మధుకర్, నాయకులు బచ్చు శ్రీకాంత్, చదిరం రాకేష్, పాటి భగవాన్ పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని కొండపర్తికి చెందిన తమే కొమురయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ రిటైర్డు టీచర్ నీరటి వెంకటనర్సయ్య, సర్పంచ్ కట్కూరి రాజమణితో కలిసి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటనర్సయ్య 50 కిలోల బియ్యంతో రూ.2 వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. వీరి వెంట బొక్కల నారాయణ, పులిగారి వెంకన్న, ఉసిల్ల రమేష్, మినుముల వెంకన్న, పోస్టు ఎల్లయ్య, కొరివి వెంకటస్వామి, చెరుకు వెంకటస్వామి, భూపతి తదితరులు ఉన్నారు.



అంధత్వ నివారణ ప్రభుత్వ ధ్యేయం



కంటివెలుగు సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

శాయంపేట : అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయమని మండల స్పెషలాఫీసర్, ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ హరిప్రసాద్ అన్నారు. ప్రభుత్వం అంధత్వ నివారణ కోసం ప్రతిష్టాత్మకంగా రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతోందని ప్రజందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల, సూర్య నాయక్‌తండా గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్ష శిబిరాలను బుధవారం ఆయన పరిశీలించారు. రెండు టీంల వైద్య సిబ్బందితో మాట్లాడి గురువారం ప్రారంభించనున్న కంటివెలుగు శిబిరానికి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణ, సర్పంచ్‌లు భూక్య రమేష్, కందగట్ల రవి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

వర్గీకరణ చేయకుంటే అడ్డుకుంటాం



మాట్లాడుతున్న మంద రాజు మాదిగ

కమలాపూర్: ఎస్సీ వర్గీకరణ చేయకుంటే గ్రామాల్లోకి వచ్చే బీజేపీ నేతలను అడ్డుకుంటామని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు మాదిగ హెచ్చరించారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ఎనిమిదేళ్లయినా వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టలేదన్నారు. ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 25 వరకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. వర్గీకరణ చేయని పక్షంలో ఈ నెల 30న హైదరాబాద్‌లో మహా దీక్ష చేపట్టి మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు చిలువేరు సంపత్, శనిగరపు రవీందర్, నద్దునూరి ప్రసాద్, కిరణ్, శనిగరపు సుధాకర్, వేల్పుగొండ భద్రయ్య, పుల్ల రమేష్, అంకిల్ల రాజమల్లు, మాట్ల ప్రసాద్, నల్లగొండ శంకర్, శనిగరపు ఆనంద్, పుల్ల రమేష్ పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



నడికూడ : ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో బీఆర్ఎస్ నాయకులు



పరకాల: ఖమ్మం సభకు తరలివెళ్తున్న ఎమ్మెలే చల్లా, బీఆర్ఎస్ నాయకులు

పరకాల /నడికూడ/ఎల్కతుర్తి/శాయంపేట/ఆత్మకూరు/ ఐనవోలు: ఖమ్మంలో బుధవారం జరిగిన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు పరకాల, నడికూడ, ఎల్కతుర్తి,శాయంపేట,ఆత్మకూరు, ఐనవోలు మండల కేంద్రం, ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో తరలిపోయారు.



ఎల్కతుర్తి : సభకు తరలివెళ్లిన నాయకులు



శాయంపేట : తరలివెళ్తున్న నాయకులు



ఐనవోలు : జెండా ఊపి ప్రారంభిస్తున్న శంకర్‌రెడ్డి

ఫ్లెక్సీలు చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ నాయకులు

ధర్మసాగర్ (వేలేరు): మండలంలోని షోడషపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ స్థానిక బీఎస్పీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు డిమాండ్ చేశాడు. బుధవారం ఆ పార్టీ శ్రేణులు వేలేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న గ్రామంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు అధికార పార్టీ నాయకులు కావాలనే చించి వేశారన్నారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డు రాహుల్‌రాయ్, ఉపాధ్యక్షుడు మోకినపల్లి చక్రపాణి, వేలేరు మండల ఉపాధ్యక్షుడు కొయ్యడ మహేష్, కీర్తి అఖిల్, మ్యాక చిరంజీవి, కొయ్యడ సురేష్, కొట్టె రాజేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలంలో ఎర్రజెండాలు



గుడిసెలు వేయకుండా అడ్డుకుంటున్న పోలీసులు

పరకాల : పట్టణంలోని 973 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమిలో స్థానిక డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో ఎంసీపీఐ ఆధ్వర్యంలో నిరుపేదలు గుడిసెలు వేసేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారుల ఆదేశాలతో కళాశాల స్థలం వద్దకు పోలీసులు చేరుకొని వారిని అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు పోలీసులకు, ఎంసీపీఐ కార్యకర్తలకు కొద్దిసేపు వాగ్వావాదం చోటుచేసుకుంది. 98 సర్వేనెంబర్‌లోని ప్రభుత్వ భూమిని గుడిసెవాసులకు కేటాయించినట్లే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని నిరుపేదలకు కేటాయించాలని ఎంసీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరిచారు.

బీజేపీలో చేరిన సర్వపూర్ ఉపసర్పంచ్

నడికూడ : మండలంలోని సర్వపూర్ ఉపసర్పంచ్ దండు సురేష్, 40 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, 10 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మోలుగురి భిక్షపతి కాషాయం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గురుప్రసాద్, రాజవీరు, ఆర్‌పీ జయంతిలాల్ పాల్గొన్నారు.

